ఈనాడు
పార్వతీపురం మన్యం
గురువారం అక్టోబరు 24, 2024



శుద్ధ నీరు.. ఏ తీరు


- 327 కేంద్రాల్లో అనుమతులున్నవి 34
- అమ్మకాలతో నిలువు దోపిడీ

ఈనాడు – పార్వతీపురం మన్యం

ఉమ్మడి జిల్లాను అతిసారం వణికిస్తోంది.. కలుషిత జలమే దీనికి కారణం. పురపాలక సంఘాలు.. పంచాయతీలు సరఫరా చేస్తున్న నీరు సక్రమంగా లేక.. వ్యాధులు నేపథ్యంలో చాలామంది శుద్ధజల కేంద్రాలపై ఆధార పడుతున్నారు. అయితే ఆ నీరు ఎంత సురక్షితమో తెలియడం లేదు. కారణం.. చాలా వాటికి అనుమతులు లేకపోగా.. కుళాయి నీరు నేరుగా అమ్మేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

రెండు జిల్లాల్లో శుద్ధ జల కేంద్రాలు 327 ఉన్నాయి. ప్రజల తాగునీటి అవసరాలను ప్రైవేటు వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. చాలా చోట్ల సాధారణ జలమే రక్షితమని నమ్మించి ఆరోగ్యాన్ని కుదేలు చేస్తున్నారు.

విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలో 83 ఆర్వో ప్లాంట్లు ఉండగా వాటిలో అధికారులు గుర్తించినవి 53 మాత్రమే. అధికారికంగా అన్ని అనుమతులు ఉన్నవి మూడు. ఒకటి సీజ్ చేసి విద్యుత్తు సరఫరా నిలిపివేశారు. ప్లాంటు వద్ద 20 లీటర్ల నీటిని రూ.20 నుంచి రూ.30 వరకు విక్రయిస్తున్నారు. మార్కెట్‌లో సీసాలు, ప్యాకెట్ల రూపంలో అమ్ముతున్నారు. ప్రజలు ఆ నీటి నాణ్యతను చూడకుండా దాహం తీర్చుకుంటున్నారు. వీటి వైపు తొంగిచూసే రెవెన్యూ, పర్యావరణ, ఆహార పదార్థాల తనిఖీ అధికారులు కరవయ్యారు.



తనిఖీలు సరే..

నాణ్యత లేని నీటి విక్రయాలతో ప్రజలను దోచుకుంటున్నారని బాధ్యతలు స్వీకరించిన నెల రోజులకే విజయనగరం కలెక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ స్పందించారు. జిల్లావ్యాప్తంగా తనిఖీలు చేపట్టాలని, తక్షణం చర్యలు తీసుకుని నివేదించాలని అధికారులను ఆదేశించారు. తనిఖీలు చేపట్టిన తహసీల్దార్లు చర్యలు తీసుకునే లోపే బదిలీలపై వెళ్లిపోవడంతో మళ్లీ యథాతథంగా ఆర్వో ప్లాంట్లలో అమ్మకాలు కొనసాగిస్తున్నారు.

నిబంధనలు పాటించరా

ఆర్వో ప్లాంటుకు 11 రకాల లైసెన్స్‌లు అవసరం. తాజాగా కాలుష్య నియంత్రణ మండలి అనుమతి తప్పనిసరి. కేంద్ర ప్రభుత్వ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (ఐఎస్ఐ) ధ్రువీకరణ ఉండాలి. జల పరీక్షలు చేయించాలి. ఆహార కల్తీ శాఖ నుంచి లైసెన్స్ తీసుకోవాలి. పంచాయతీ, పురపాలక సంఘాల్లో ఎన్‌వోసీ పొందాలి. తూనికల కొలత శాఖ నుంచి ప్యాకింగ్‌కు, పరిశ్రమలు, కార్మిక శాఖ నుంచి లైసెన్స్‌లు ఉండాలి. లావాదేవీలపై జీఎస్టీ చెల్లించాలి. వీటికి పాతరేసిన ప్రైవేటు వ్యాపారులు దండిగా సంపాదిస్తున్నారు. ఆర్వో ప్లాంట్ల నిర్వహణలో నాణ్యత ప్రమాణాలు పాటించకుండా తక్కువ ధరకు విక్రయాల వల్ల అన్ని అనుమతులు ఉన్న వ్యాపారులు నష్టపోతున్నారని అనుమతి పొందిన ప్లాంట్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణ పేర్కొన్నారు.

అనుమతి లేనివి మూయిస్తాం..: అనుమతి లేకుండా ఆర్వో ప్లాంట్లు కొనసాగనివ్వం. తనిఖీలు చేపట్టి తక్షణం చర్యలు తీసుకుంటాం. జిల్లా వ్యాప్తంగా ఈ ప్రక్రియ చేపడతాం. అధికారుల నివేదిక ఆధారంగా అన్ని అనుమతులు లేని వాటిని సీజ్ చేస్తాం. ఇప్పటికే ఇటువంటివి ఎన్ని గుర్తించారు. తీసుకున్న చర్యలేమిటి.. అని అధికారులతో సమావేశమై సమీక్షిస్తా. ఈ వ్యవహారంలో కఠినంగానే వ్యవహరిస్తాం. – ఎ.శ్యామ్‌ప్రసాద్, కలెక్టర్

ఇంటింటికీ ఆయుష్ సేవలు


జిల్లా ఆసుపత్రిలో సామగ్రి చూస్తున్న వైద్యాధికారిణి సుశీల

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: ఆయుష్ సేవలు ఇంటింటికీ చేరేలా కేంద్రం చర్యలు చేపట్టింది. సంబంధిత కరపత్రాలు, పుస్తకాలు జిల్లా కేంద్రానికి పంపినట్లు వైద్యాధికారిణి సుశీల తెలిపారు. ఏడుగురు ఆయుష్ వైద్యాధికారుల పర్యవేక్షణలో 37 పీహెచ్‌సీల్లోని ఆశా కార్యకర్తలకు త్వరలో ఆయుర్వేదం, హోమియో, యునాని, యోగా, ప్రకృతి వైద్యంపై శిక్షణ ఇచ్చి వారి ద్వారా ఇంటింటికీ సేవలు చేరువ చేస్తామని చెప్పారు.

ప్రకృతికి ప్రణామం

- పెరుగుతున్న పెట్టుబడులు..
- అవసరానికి మించిన రసాయన ఎరువులు..
- ఏటా తగ్గుతున్న భూసారం..
- అన్నదాతలపై అదనపు భారం..

గతంలో జిల్లాలో ఏ గ్రామంలో చూసినా ఇదే పరిస్థితి. అధిక దిగుబడులు సాధించాలనే ఆశ.. పురుగు పీడల నుంచి బయట పడాలనే ఆలోచనతో రైతులు గతంలో ఎక్కువగా రసాయన ఎరువులు వినియోగించేవారు. ఇప్పుడిప్పుడే ఆ ధోరణి నుంచి బయట పడి ప్రకృతి వ్యవసాయానికి పెద్దపీట వేస్తున్నారు.

– న్యూస్‌టుడే, గుమ్మలక్ష్మీపురం


జీవామృతాల తయారీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

జట్టు స్వచ్ఛంద సంస్థ, వ్యవసాయ శాఖ అధికారుల సూచనలతో రైతులు ప్రకృతి సేద్యం వైపు మళ్లారు. జిల్లాలోని 113 గ్రామాల్లో వంద శాతం ఆ విధానంలోనే పండిస్తున్నారు. ఇక్కడ 4,275 మంది రైతులు 12,410 ఎకరాల్లో పంటలు వేశారు.


అధిక దిగుబడులు

ఒకప్పుడు ఎంత కష్టపడినా పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొనేది. ప్రస్తుతం నవధాన్యాలు, పచ్చిరొట్ట ఎరువుల వినియోగం, స్థానిక వనరులతో జీవామృతాలు తయారు చేసుకుని ఎరువుగా వినియోగిస్తున్నారు. దీంతో భూసారం పెరిగి అధిక దిగుబడులు సాధిస్తున్నారు. గతంలో ఎకరాకు 15 నుంచి 17 బస్తాల వరి దిగుబడి వస్తే ప్రస్తుతం 25 బస్తాల వరకు వస్తున్నట్లు చెబుతున్నారు.

44,587 ఎకరాల్లో సేంద్రియ సాగు

113 గ్రామాల్లో వంద శాతం


వరి పంటకు కషాయం వేస్తున్న రైతు



విదేశీ బృందాల పర్యటన

విదేశీయులు సైతం జిల్లాకు వచ్చి సేంద్రియ సాగు విధానంపై క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. ఇటీవల ఏజెన్సీలో పంటలను జర్మనీ, ఇథియోపియా, సింగపూర్, ఆస్ట్రియా దేశాలతో పాటు మేఘాలయ, తెలంగాణ, ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాల నుంచి ప్రతినిధులు వచ్చి చూసి వెళ్లారు.

సొంతంగా ఎరువులు



మా ప్రాంతంలో లభించే వివిధ రకాల చెట్ల ఆకులు, ఆవు పేడతో ఎరువులు తయారు చేసి ఎకరాలో శ్రీవరి సాగు చేయగా 25 బస్తాల దిగుబడి వచ్చింది. శ్రీ రాగి 30 సెంట్లలో వేయగా.. 2.50 క్వింటాళ్లు వచ్చింది. మరో ఎకరాలో కంది, కూరగాయలు, జొన్న పండిస్తున్నా.

- కె.మాలతి, మహిళా రైతు బాతుగుడబ

వరి, అరటి, కూరగాయలు



ఏటా సేంద్రియ పద్ధతిలో రెండెకరాల్లో శ్రీవరి, అరటి, కూరగాయలు, పసుపు సాగు చేస్తున్నా. అన్నీ అధిక దిగుబడులు వస్తున్నాయి. శ్రీవరి 15 బస్తాలు వచ్చింది. నేను ఆచరిస్తూ గ్రామంలోని మిగిలిన వారికి అవగాహన కల్పిస్తున్నా.

- ఆర్.అన్నపూర్ణ, మహిళా రైతు, నందివానివలస

లక్ష్య సాధనకు కృషి



ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ ఎరువులు, కషాయాలు, జీవామృతాల తయారీ, వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఈ ఏడాది 74,811 మంది రైతులు 94,082 ఎకరాల్లో సాగు చేయాలని లక్ష్యంగా నిర్దేశించాం. ఇప్పటికే 66 శాతం పూర్తయింది. సిబ్బంది సమన్వయంతో లక్ష్య సాధనకు కృషి చేస్తున్నాం.

- షణ్ముఖరాజు, ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రబంధకుడు

తుపానుపై అప్రమత్తం

పార్వతీపురం, న్యూస్‌టుడే: తుపాను నేపథ్యంలో జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. బుధవారం జిల్లా, మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. ఎప్పటికప్పుడు వర్షాలు, వరదలను గమనించి కలెక్టరేట్‌కు సమాచారం అందించి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. పూరిళ్లు, శిథిలావస్థకు చేరిన గృహాల్లో ఉంటున్న వారిని సురక్షిత భవనాల్లోకి, గర్భిణులు, వృద్ధులను వసతిగృహాలకు తరలించాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని, నదులు, వాగులు, చెరువుల వద్దకు ఎవరూ వెళ్లకుండా చూడాలని సిబ్బందికి సూచనలు చేశారు.

నదిలో పడవ ప్రయాణం నిషేధం

కొమరాడ, న్యూస్‌టుడే: దానా తుపాను నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని ఇన్‌ఛార్జి తహసీల్దారు శివయ్య అన్నారు. బుధవారం మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. నాగావళి, జంఝావతి తీర ప్రాంతాలు కూనేరు, పూర్ణపాడు, పాత కళ్లికోట, దుగ్గి, దళాయిపేట, దేవునిగుంపలో వరద పరిస్థితిని గమనించాలన్నారు. కొమరాడ-కొట్టు, పూర్ణపాడు-లాబేసు, రెబ్బ-మెట్టుకరడ మధ్య పడవల రాకపోకలు జరగకుండా చూడాలన్నారు. పాలెం, మాదలింగి వంతెనలపై గుమ్మడిగెడ్డ నీరు ప్రవాహం ఉంటే వాహనాలు, ప్రజల రాకపోకలు నిషేధించాలన్నారు. ఎంపీడీవో మల్లికార్జునరావు, ఎస్ఐ నీలకంఠం అధికారులు పాల్గొన్నారు.

పారాది వంతెన పనులు చకచకా

బొబ్బిలి, న్యూస్‌టుడే: ఆంధ్రా-ఒడిశా రాష్ట్రాలకు ప్రధాన మార్గమైన పారాది వంతెన శిథిలావస్థకు చేరడంతో ఐదేళ్లుగా ప్రయాణికులు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం వారధి నిర్మాణంలో కదలిక తీసుకొచ్చింది. ఈ నెల 4న ఎమ్మెల్యే బేబినాయన పనులకు శంకుస్థాపన చేశారు. వేగావతిలో నీరు తగ్గడంతో పనులు చకాచకా సాగుతున్నాయి. వేగంగా పూర్తిచేయాలని గుత్తేదారును ఆదేశించామని ర.భ.శాఖ ఏఈ అప్పలరాజు తెలిపారు.



ఆకట్టుకున్న తుపాకులు.. అబ్బురపర్చిన విన్యాసాలు


ఆయుధాల గురించి వివరిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: పోలీసు అమర వీరుల వారోత్సవాల్లో భాగంగా కొత్త బెలగాంలో ఓపెన్ హౌస్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. పోలీసుల విధులు, ఎదురయ్యే సవాళ్లు, సాంకేతిక పరిజ్ఞానం, తుపాకుల్లో రకాలు, వినియోగం, గ్రెనైడ్ల గురించి ఎస్పీ మాధవరెడ్డి వివరించారు. మూక దాడులు, అల్లర్ల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పొగ బాంబు వినియోగంపై ఏఎస్పీలు దిలీప్‌కిరణ్, అంకిత సురానా తెలియజేశారు. విద్యార్థులు తుపాకులు ఎక్కుపెట్టి ఫొటోలకు ఫోజులిచ్చారు.

ఆసక్తిగా తిలకించారు: ఓ బాలిక రుమాలు (చేతివస్త్రం)తో ముఖం, చేతులు తుడుచుకొని మరో పది రుమాళ్ల మధ్య పెట్టింది. అంతకుముందు ఓ శునకం బాలిక వద్దకు వచ్చి వాసన చూసింది. గుంపు మధ్యలో ఉన్న విద్యార్థిని తుడుచుకున్న రుమాలు గుర్తించి పోలీసు అధికారికి శునకం అందించింది. దీనిని విద్యార్థులు ఆసక్తిగా గమనించారు. అనంతరం హడల్స్, అగ్గితో ఉన్న రింగుల్లోంచి జంపింగ్స్, డ్రగ్స్ వాసన పసిగట్టడం తదితర విన్యాసాలతో శునకాలు అబ్బురపరిచాయి.


తుపాకీ గురిపెట్టిన విద్యార్థిని


డాగ్ షో

సుద్దముక్కలకు డబ్బులొచ్చాయ్

గత పాలనలో అష్టకష్టాలు

పార్వతీపురం పట్టణం, విజయనగరం విద్యావిభాగం, సీతానగరం, న్యూస్‌టుడే

- పార్వతీపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు గత ప్రభుత్వ హయాంలో నిర్వహణ నిధులు రాలేదు. 350 మంది పిల్లలున్న ఇక్కడ సుద్దముక్క కొనేందుకూ ఇబ్బంది ఎదురైంది. హెచ్‌ఎం వరప్రసాదరావు సొంతంగా రూ.90 వేల వరకు ఖర్చు చేశారు. ప్రస్తుతం నిధులు విడుదల కావడంతో ఆయన ఊపిరి పీల్చుకున్నారు.
- సీతానగరం మండలం మరిపివలస ఉన్నత పాఠశాలలో 150 మంది చిన్నారులు చదువుతున్నారు. కొన్నాళ్లుగా నిర్వహణ గ్రాంటు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రాష్ట్రంలో పాఠశాలలకు ఇటీవల విద్యాశాఖ మంత్రి లోకేశ్ రూ.100 కోట్లు నిర్వహణ గ్రాంటు విడుదల చేశారు. దీంతో ఏళ్లుగా జేబుల్లో డబ్బులు పెడుతున్న ప్రధానోపాధ్యాయులు ఊపిరి పీల్చుకున్నారు. గత పాలనలో కనీసం నిధులు విడుదల చేయలేదు.


పిల్లలకు పాఠం బోధిస్తున్న ఉపాధ్యాయుడు

ఉమ్మడి జిల్లాల పరిధిలో 3,299 పాఠశాలలున్నాయి. వీటిలో 2,45,294 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వం ఏటా బడులకు నిర్వహణ నిధులు మంజూరు చేయాలి. వీటితో పాటు పాఠశాల గ్రాంటు అందించాలి. వైకాపా పాలనలో ఈ నిధులు విడుదల సరిగా లేదు. గతేడాది ఒక్క రూపాయి కూడా రాకపోవడంతో చాలా మంది ప్రధానోపాధ్యాయులు జేబులోంచి ఖర్చు చేసి ప్రభుత్వం ఇస్తుందని ఎదురు చూశారు. ఇంతలో ప్రభుత్వం మారడంతో నిధులు వస్తాయా? రావా అనుకున్నారు.

ఎలా అంటే..

పాఠశాలల నిర్వహణకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిధులు విడుదల చేస్తారు. పాఠశాలలో 15 మంది విద్యార్థులు లోపు ఉంటే రూ.10 వేలు, 50 మంది లోపుంటే రూ.12,500, వంద లోపుంటే రూ.25 వేలు, 250 మంది ఉంటే రూ.50 వేలు, 400 మంది అయితే రూ.లక్ష వరకు అందిస్తారు. వీటిని ప్రధానోపాధ్యాయులు సుద్దముక్కలు, కుర్చీలు, టేబుళ్లు, పెన్నులు, డస్టర్లు తదితర వాటికి వినియోగిస్తారు. ఇక పాఠశాల గ్రాంటు ప్రభుత్వం ఏటా విడుదల చేస్తుంది. వీటిని విద్యుత్తు బిల్లులు, గదుల మరమ్మతులు, తాగునీటి సమస్యలు తదితర వాటికి ఖర్చు చేస్తారు. నిర్వహణ గ్రాంటు కింద రూ.3.15 కోట్లు, 42 ఎమ్మార్సీలకు రూ.54.50 లక్షలు విడుదలైనట్లు విద్యాశాఖ వర్గాలు తెలిపాయి.

జిల్లాల వారీగా ఇలా..

జిల్లా	పాఠశాలలు	మంజూరు	విడుదల	ఎంఆర్సీలు	నిధులు
విజయనగరం	1702	4.15 (కోట్లు)	2.07	27	35(లక్షలు)
పార్వతీపురం మన్యం	1597	2.16	1.08	15	19.5

రెండు మూడు రోజుల్లో జమ: పాఠశాలల నిర్వహణ, ఎంఆర్సీలకు సంబంధించిన నిధులు విడుదలయ్యాయి. ఆ మేరకు ఆయా హెచ్‌ఎంల ఖాతాలకు ఒకటి, రెండు రోజుల్లో జమ చేస్తాం. నిర్వహణ గ్రాంట్లు సక్రమంగా వినియోగించేలా దృష్టి సారిస్తాం. – పగడాలమ్మ, ప్రేమకుమార్, డీఈవోలు

హైరిస్కు గర్భిణులపై దృష్టి

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో రక్తహీనతతో ఉండే అత్యంత ప్రమాదకర (హైరిస్క్) గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టరు శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. బుధవారం జిల్లాలోని వైద్యాధికారులతో దూరదృశ్య శ్రవణ సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఎలాంటి మాతా శిశు మరణాలు జరగకూడదని, హైరిస్క్ కేసులు ముందుగా గుర్తించి సేవలు అందించాలన్నారు. ఎక్కడైనా మరణాలు సంభవిస్తే అధికారులు, సిబ్బందిపై చర్యలు చేపడతామని హెచ్చరించారు. జిల్లా వైద్యాధికారిణి విజయపార్వతి, డీసీహెచ్ఎస్ వాగ్దేవి, డీఎల్ఏటీవో వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.





క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

పాలకొండ, గ్రామీణం, న్యూస్‌టుడే: క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని డీఎస్పీ ఎం.రాంబాబు పేర్కొన్నారు. పాలకొండలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో బుధవారం అంబేడ్కర్ వర్సిటీ పరిధిలోని అంతర్ కళాశాలల క్రీడలను ఆయన ప్రారంభించారు. పోటీల్లో గెలుపు, ఓటములు సమానంగా స్వీకరించాలని, ఎలాంటి వివాదాలకు తావులేకుండా క్రీడా పరిణితి చూపాలన్నారు. డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ పి.కృష్ణారావు మాట్లాడుతూ క్రీడా కోటా ద్వారా ఉద్యోగాల్లో మంచి అవకాశాలు వస్తాయన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డా.ఎం.శ్యామ్‌బాబు మాట్లాడుతూ విశ్వవిద్యాలయ స్థాయి పోటీలు పాలకొండలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విశ్వవిద్యాలయ క్రీడా బోర్డు కార్యదర్శులు ఎం.శ్రీనివాసరావు, ఎ.భాస్కరరావు, ఎంఈవో కె.సోంబాబు, గ్రంథాలయ విశ్రాంత అధికారి కె.చౌదరి నాయుడు, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.రామకృష్ణ, వి.పుష్పనాథం, నారాయణమూర్తి, సీతారాం, రాములు, వెంకటరమణ, రాజు, శంకర్‌బాబు పాల్గొన్నారు.


క్రీడాజ్యోతి వెలిగిస్తున్న డీఎస్పీ, అతిథులు



కోలాటంతో క్రీడాకారులకు స్వాగతం



మాబడి తోట.. ఆరోగ్య బాట


కుంతాం పాఠశాలలో పండించిన కూరగాయలతో చిన్నారులు

విద్యార్థులకు పోషక విలువలతో నిండిన ఆహారం అందించాలనే ప్రభుత్వ ఆశయం చక్కటి ఫలితాలనిస్తోంది. మాబడి తోట కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు పాఠశాలల ఆవరణల్లో బీర, ఆనప, వంగ, బెండ తదితర 12 రకాల కూరగాయలను సాగు చేస్తున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు శ్రద్ధతో రక్షణ బాధ్యతను తీసుకోవడంతో కొన్నిచోట్ల కూరగాయలు కాపు దశకొచ్చాయి. కుంతాం, బడ్నాయకవలస, సరాయివలస, నంద పనుకువలస, చొక్కాపువలస తదితర గ్రామాల్లోని విద్యాలయాల్లో వారంలో ఒకపూట భోజనానికి సరిపడేలా సమకూరుతున్నాయని ఎంఈవో పి.సతీష్ తెలిపారు. చిన్నారులు చదువుతో పాటు సాగుపై కూడా దృష్టిసారిస్తున్నారని చెప్పారు
– న్యూస్‌టుడే, పాచిపెంట


నంద పనుకువలస గ్రామంలోని విద్యాలయంలో పందిరికి వేలాడుతున్న బీర, ఆనప కాయలు


నంద పనుకువలస పాఠశాలలో కాపుకొచ్చిన గోంగూర



పోలియోను అంతం చేస్తామని బాలలు పంతం పట్టారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రాజాం మండలం పొగిరిలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం 'end polio' ఆకృతిలో ఏర్పడి చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా ఆప్తాల్మిక్ అధికారి వసంతరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చిన్నారులకు ఆయన అవగాహన కల్పించారు. అనంతరం వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. – న్యూస్‌టుడే, రాజాం

'గిరి' విద్యార్థులకు నాణ్యమైన ఆహారం

సీతంపేట, న్యూస్‌టుడే: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, పోస్టుమెట్రిక్ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు మరింత నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. కొన్నేళ్లుగా విద్యా సంస్థల్లో ఆహారం కలుషితం కావడం, మెనూ అమల్లో లోపాలు, ఈక్రమంలో ఉపాధ్యాయులపై ఒత్తిడి తదితర సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ నేపథ్యంలో అక్షయపాత్ర ఫౌండేషన్ ద్వారా ఆహారం సరఫరా చేయాలని నిర్ణయించింది. ఈమేరకు డైట్‌ఛార్జీలతో పాటు మరికొంత సొమ్మును ఆ ఫౌండేషన్‌కే అందించనుందని తెలుస్తోంది.

ఇదీ పరిస్థితి..

సీతంపేట, పార్వతీపురం ఐటీడీఏల పరిధిలో 94 ఆశ్రమ పాఠశాలలు, 24 పోస్టుమెట్రిక్ వసతి గృహాలున్నాయి. వీటి పరిధిలో సుమారు 30 వేల మంది చదువుతున్నారు. ఆయా విద్యా సంస్థల్లో ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బందికి శిక్షణ ఇచ్చి, వారి ద్వారా అహారాన్ని తయారు చేయించాలని భావిస్తున్నారు. అక్షయపాత్ర ద్వారా రోజువారీ సరఫరా చేస్తారు. కోడిగుడ్లు, కోడికూర(చికెన్) మాత్రం ప్రత్యేకంగా వండి నిర్దేశిత రోజుల్లో పెట్టనున్నారు.

సిబ్బంది లేక ఇబ్బంది..

ప్రస్తుతం విద్యార్థుల సంఖ్యకు తగినట్లు వంటవారు లేరు. దీంతో చాలా కాలంగా సంక్షేమాధికారులు, డిప్యూటీ వార్డెన్లు తమ సొంత డబ్బులతో బయట వారిని ఏర్పాటు చేసుకొని పనులు చేయిస్తున్నారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలో నాలుగో తరగతి ఉద్యోగులు పోస్టులు 96 వరకు ఖాళీగా ఉన్నాయి. 87 పోస్టులను పొరుగు సేవల కింద భర్తీ చేసేందుకు ఇప్పటికే అనుమతులు వచ్చినా ఇంకా ప్రక్రియ పూర్తికాలేదు. పార్వతీపురం ఐటీడీఏలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. దీనికి తోడు నెలల తరబడి డైట్ బిల్లులు బకాయిలున్నాయి. ఈ భారమంతా సంక్షేమాధికారులు, హెచ్‌డబ్ల్యూవోలు, డిప్యూటీ వార్డెన్లపై పడుతోంది. వీరిని వంట బాధ్యతల పర్యవేక్షణ నుంచి తప్పిస్తే ఇతర సమస్యలపై దృష్టిసారిస్తారని ప్రభుత్వం భావిస్తోంది. దీనిపై ఆదేశాలు రావాలని గిరిజన సంక్షేమ సాధికారత అధికారి అన్నాదొర 'న్యూస్‌టుడే'కు తెలిపారు.


గిరిజన వసతి గృహంలో భోజనాలు చేస్తున్న విద్యార్థులు

పంచ్ పటాకా.. పతకాల సాధక..!


వారు పోడియంపై నిలబడితే.. ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరుగెడతాయి.. పంచ్ విసిరితే పతకాల పంట పండుతుంది. నిరుపేద కుటుంబాల్లో పుట్టినా.. వారి లక్ష్యానికి అది అడ్డంకి కాలేకపోయింది.. బాక్సింగ్ క్రీడపై చిన్నతనం నుంచి ఉన్న ఆసక్తితో పట్టుదల, సాధనతో ప్రతిభ చాటుతూ.. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తూ.. విజేతలుగా నిలుస్తున్నారు జిల్లాకు చెందిన యువ క్రీడాకారులు. 'ఖేలో ఇండియా' శిక్షకుడు సీతారామాంజనేయులు శిక్షణతో మరింత రాటుదేలుతున్నారు. ఇటీవల పలు జాతీయ టోర్నీల్లో పతకాలు సాధించారు.
– న్యూస్‌టుడే, విజయనగరం క్రీడావిభాగం

క్రీడా కిరణం...



విజయనగరంలో ఓ సాధారణ కుటుంబానికి చెందిన డి.కిరణ్‌కుమార్‌కు పాఠశాల స్థాయి నుంచే బాక్సింగ్‌పై మక్కువ కలిగింది. నిత్య సాధనతో సత్తా చాటుతున్నాడు. ప్రస్తుతం ఇంటర్మీడియట్ చదువుతూ చదువు, క్రీడలో రాణిస్తున్నాడు. గతేడాది నగరంలో జరిగిన అండర్-17 స్కూల్‌గేమ్స్‌లో స్వర్ణం గెల్చుకున్నాడు. ఇటీవల విశాఖలో నిర్వహించిన టోర్నీలో ప్రతిభ చాటి గువాహటి మీట్‌కు ఎంపికయ్యాడు. జాతీయ స్థాయిలో రాణించడమే లక్ష్యమని పేర్కొన్నాడు.

బరిలో దిగితే బాదుడే..



పుత్సలవీధికి చెందిన టి.బాలకుమార్ రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ఆరుసార్లు పాల్గొన్నాడు. 2023- స్కూల్‌గేమ్స్ అండర్-17లో స్వర్ణం సాధించి, మహారాష్ట్రలో జరిగిన జాతీయస్థాయి మీట్‌కు ఎంపికయ్యాడు. అసోసియేషన్ జూనియర్ టోర్నీలో బంగారు పతకం గెలిచి, అరుణాచల్‌ప్రదేశ్ నేషనల్ మీట్‌కు ఎంపికయ్యాడు. ఈ ఏడాది విశాఖలో జరిగిన పోటీలో ప్రతిభ చాటి గువాహటి టోర్నీకి ఎంపికయ్యాడు. ఇందులో టాప్-8లో నిలిచాడు.

తండ్రి స్ఫూర్తితో..



లంకాపట్నానికి చెందిన డి.నిరీక్షణ ప్రస్తుతం ఇంటర్మీడియట్ చదువుతోంది. తండ్రి మారయ్య బాక్సింగ్ క్రీడాకారుడు కావడంతో చిన్నతనం నుంచి ఆ క్రీడపై ఆసక్తి పెంచుకుంది. పట్టుదలతో సాధన చేసి జిల్లా, రాష్ట్ర స్థాయి టోర్నమెంట్లలో సత్తా చాటుతోంది. జాతీయస్థాయిలో రెండు సార్లు పాల్గొంది. గతేడాది జిల్లాలో జరిగిన రాష్ట్ర స్కూల్‌గేమ్స్- 17లో స్వర్ణం కైవసం చేసుకొని దిల్లీలో జరిగిన జాతీయస్థాయి మీట్‌కు ఎంపికైంది. ఈ ఏడాది గువాహటి టోర్నీలో రజతం కైవసం చేసుకొని టాప్-8లో నిలిచింది. హరియాణాలో జరిగిన మీట్‌లో కాంస్యం గెల్చుకుంది. తండ్రి స్ఫూర్తితో అడుగులు వేస్తున్నట్లు ఆమె చెబుతోంది.

ప్రతిభతో పతకం పట్టి..



జిల్లా కేంద్రానికి చెందిన పదో తరగతి విద్యార్థి ఎం.సూర్యతేజ్ రాష్ట్ర, జాతీయస్థాయిలో మూడు సార్లు చొప్పున పాల్గొన్నాడు. గతేడాది నగరంలో జరిగిన టోర్నీలో స్వర్ణం సాధించి మహారాష్ట్ర పోటీలకు ఎంపికయ్యాడు. విజయవాడ టోర్నీలో బంగారు పతకం కైవసం చేసుకొని అరుణాచల్‌ప్రదేశ్ పోటీల్లో పాల్గొన్నాడు. ఈ ఏడాది విశాఖలో జరిగిన పోటీల్లో ప్రతిభ చూపి, హరియాణా మీట్‌కు ఎంపికై కాంస్యం పొందాడు

జాతీయస్థాయి గుర్తింపే లక్ష్యం

జొన్నగుడ్డికి చెందిన సతీష్, జ్యోతి దంపతుల కుమారుడు ప్రభాస్ వర్ధన్. ఇంజినీరింగ్ చదువుతున్నాడు. 2022- శాప్ లీగ్‌లో ప్రతిభ కనబర్చాడు. రాజమహేంద్రవరంలో 2023లో జరిగిన స్కూల్‌గేమ్స్-19 పోటీల్లో స్వర్ణం గెలిచి, మధ్యప్రదేశ్‌లో జరిగిన నేషనల్ టోర్నీకి ఎంపికయ్యాడు. అదే ఏడాది విశాఖలో నిర్వహించిన రైల్వే 6వ యూత్ స్టేట్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించి, సిక్కింలో నేషనల్ మీట్‌కు ఎంపికై రాణించాడు. విశాఖలో యూనివర్సిటీ టోర్నీలోనూ స్వర్ణం గెల్చుకొని.. సౌత్‌జోన్ టోర్నీలోకి అడుగుపెట్టిన ప్రభాస్ ఒకే ఏడాది మూడు నేషనల్ టోర్నీల్లో ఆడాడు. ఇండియా బాక్సర్‌గా గుర్తింపే లక్ష్యమని పేర్కొంటున్నాడు.



28న జిల్లాస్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: మహాకవి గురజాడ అప్పారావు వర్ధంతి సందర్భంగా జిల్లాస్థాయిలో ఉన్నత పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు గురజాడ సాంస్కృతిక సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కాపుగంటి ప్రకాష్ తెలిపారు. ఈనెల 28న ఉదయం నగరంలోని కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తామన్నారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు 'కన్యాశుల్కం- నాటి సామాజిక పరిస్థితులు' అంశంపై 4 నిమిషాలు మాట్లాడాలని, గురజాడ దేశభక్తి, సాహిత్యంలో మహిళ అన్న అంశంపై సీనియర్, జూనియర్ విభాగాల వారికి వ్యాసరచన ఉంటుందని చెప్పారు. విజేతలకు నవంబరు 30న సాయంత్రం బహుమతులు అందిస్తామని, వివరాలకు 83744 49526, 99127 64646 నంబర్లను సంప్రదించాలని కోరారు.

నేత్రదానంతో మరొకరికి చూపు


ఎస్.లక్ష్మి (పాతచిత్రం)

కొత్తవలస, న్యూస్‌టుడే: కొత్తవలస మండలం తుమ్మికాపల్లి పంచాయతీ శివారు కాళింగపేటకు చెందిన ఎస్.లక్ష్మి(70) బుధవారం ఉదయం మరణించారు. విషయం తెలుసుకున్న విన్నకోట రాజేష్ బాధిత కుటుంబ సభ్యుల్ని సంప్రదించి నేత్రదానంపై అవగాహన కల్పించారు. దీంతో ఆమె కుమారుడు కనకరాజు, మనవళ్లు సంతోష్, భైరాగి ముందుకొచ్చారు. ఈక్రమంలో విశాఖపట్నానికి చెందిన మోహిషిని ఐ బ్యాంకు సిబ్బంది చేరుకుని లక్ష్మి కార్నియాలు సేకరించారు. నేత్రదానంతో మరొకరికి చూపు ఇవ్వొచ్చని రాజేష్ పేర్కొన్నారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	132	234	244

అత్యాచారం ఫిర్యాదుపై దర్యాప్తు

పార్వతీపురం పట్టణం, పురపాలక, బొబ్బిలి, న్యూస్‌టుడే: అత్యాచారం ఫిర్యాదుపై పోలీసులు బుధవారం దర్యాప్తు నిర్వహించారు. పార్వతీపురంలోని ఓ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినిని బొబ్బిలి మండలానికి చెందిన యువకుడు అత్యాచారం చేశాడని ఆమె తల్లిదండ్రులు డయల్ యువర్ 100కి ఫిర్యాదు చేశారు. పార్వతీపురం పట్టణ పోలీసులు అప్రమత్తమై బాధితురాలిని కలిసి వివరాలు సేకరించారు. తదుపరి దర్యాప్తు నిమిత్తం బొబ్బిలి పోలీసులకు వివరాలు పంపించామని చెప్పారు. దీనిపై బొబ్బిలి సీఐ సతీష్‌కుమార్ వద్ద ప్రస్తావించగా.. తమకు ఎలాంటి ఫిర్యాదు, సమాచారం రాలేదన్నారు. పార్వతీపురంలో విద్యార్థిని ఇచ్చిన సమాచారం మేరకు యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

మహిళ ఆత్మహత్యాయత్నం


పార్వతీపురం పట్టణం, పురపాలక: ఫినాయిల్ తాగి మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన పార్వతీపురంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. కొత్తవలసకు చెందిన శైలజ భర్త విజయవాడలో ఉంటున్నారు. ఆమె బుధవారం ఫినాయిల్ తాగి అపస్మారక స్థితికి చేరుకున్నారు. బంధువులకు విషయం తెలిసి బాధితురాలిని జిల్లా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేశామని, వివరాలు తెలియాల్సి ఉందని అవుట్ పోస్టు పోలీసులు తెలిపారు.

కడుపునొప్పి తాళలేక యువకుడి మృత్యువాత


రమేష్ (పాతచిత్రం)

వంగర, న్యూస్‌టుడే: కడుపునొప్పితో ఓ యువకుడు ప్రాణాలు విడిచాడు. హెచ్‌సీ రామకృష్ణ వివరాల మేరకు.. వంగర మండలం అరసాడ గ్రామానికి చెందిన జి.రమేష్(31) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మంగళవారం తీవ్రమైన కడుపునొప్పి రావడంతో భరించలేక పురుగు మందు తాగేశాడు. కుటుంబ సభ్యులు గమనించి, శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. రమేష్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. నెలరోజులుగా ఇంటి వద్దే ఉంటున్నాడు. ఆయన తండ్రి అప్పలసూరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

అనుకోని ప్రమాదం.. తీసింది ప్రాణం


వెంకటనాయుడు (పాతచిత్రం)

కొమరాడ, అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే: దైవ కార్యక్రమానికి వెళ్లి, విశాఖలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మన్యం జిల్లా వాసి దుర్మరణం చెందాడు. గాజువాక పోలీసుల వివరాల ప్రకారం.. కొమరాడ గ్రామానికి చెందిన కె.వెంకటనాయుడు(54)కు భార్య, కుమారుడు, వివాహాలైన ఇద్దరు కుమార్తెలున్నారు. పెద్ద అల్లుడు వెంకటేశ్ విశాఖలోని జోగవానిపాలెంలో నివాసం ఉంటున్నాడు. ఆయన ఇటీవల భవానీమాల వేశారు. బుధవారం ఇంటివద్ద పూజా కార్యక్రమం నిర్వహించారు. దీంతో వెంకటనాయుడు కుటుంబ సభ్యులంతా వెళ్లారు. సాయంత్రం అల్లుడితో కలిసి ద్విచక్రవాహనంపై ఎన్ఏడీ వైపు వెళ్తుండగా.. షీలానగర్ వద్దకు వచ్చేసరికి.. స్కూటీ ముందు భాగంలో ఉన్న నూనె డబ్బా కారణంగా హ్యాండిల్ తిరగకపోవడంతో ఒక్కసారిగా అదుపుతప్పి పక్కనే ఉన్న డివైడర్‌ను బలంగా ఢీకొట్టారు. వెంకటేశ్‌కు స్వల్ప గాయాలు కాగా.. వెనుక కూర్చున్న వెంకటనాయుడు తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసులు చేరుకుని మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. క్షతగాత్రుడ్ని సమీప ఆసుపత్రిలో చేర్పించారు. కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.


ప్రమాద స్థలిలో మృతిచెందిన వెంకటనాయుడు, గాయపడిన వెంకటేశ్(భవానీ మాలధారణ వ్యక్తి)

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

గరివిడి, న్యూస్‌టుడే: గరివిడి రైల్వేస్టేషన్ సమీపంలో కోణార్క్ ఎక్స్‌ప్రెస్ నుంచి ప్రమాదవశాత్తు జారిపడి అసోంకు చెందిన నిత్యానంద్‌రాయ్ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు రైల్వే హెచ్‌సీ చక్రధర్ తెలిపారు. భువనేశ్వర్ నుంచి విజయవాడ వెళ్తుండగా ప్రమాదం జరిగిందని, కేసు నమోదు చేసి, కుటుంబీకులకు సమాచారం అందించామన్నారు.

ద్విచక్రవాహనాల ఢీ: ముగ్గురికి గాయాలు

రామభద్రపురం, న్యూస్‌టుడే: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ముగ్గురికి తీవ్రగాయాలైన ఘటన రామభద్రపురం మండలంలో జరిగింది. ఎస్సై ప్రసాదరావు వివరాల ప్రకారం.. రామభద్రపురం మండలం ఎస్.సీతారాంపురం గ్రామానికి చెందిన ఆర్.సురేష్, లక్ష్మణరావు, నాయుడువలసకు చెందిన బి.రాము బుధవారం రాత్రి బాడంగి- రామభద్రపురం ప్రధాన రోడ్డులో ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ఘటనలో ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని క్షతగాత్రులను ఆటోలో బాడంగి సీహెచ్‌సీకి, అక్కడి నుంచి విజయనగరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

శ్రీక్షేత్రంలో నేడు, రేపు దర్శనాల రద్దు

గోపాలపూర్, న్యూస్‌టుడే: పూరీ శ్రీక్షేత్రంలో గురు, శుక్రవారాల్లో భక్తుల దర్శనాలు రద్దు చేశారు. పూరీ పాలనాధికారి సిద్ధార్థశంకర్ స్వయిన్ బుధవారం సాయంత్రం విలేకర్లతో మాట్లాడుతూ తుపాను వల్ల పూరీలో 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, వానలు కురుస్తాయని ఐఎండీ హెచ్చరించిన నేపథ్యంలో భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. హబిషార్థులు కూడా రాకూడదన్నారు. వారు తమ శిబిరాల్లో స్వామిని ఆరాధించాలన్నారు. శ్రీక్షేత్రం వెలుపల నుంచి కూడా పతితపావన దర్శనం చేసుకోరాదని, ఆలయ పరిసరాలకు రావద్దని విన్నవించారు. తుపాను నేపథ్యంలో భువనేశ్వర్‌లోని జంతు ప్రదర్శనశాల నందన్‌కానన్‌ను గురు, శుక్రవారాల్లో మూసివేస్తున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

ధ్యానంతో ఆరోగ్యకర జీవితం


సమావేశంలో మాట్లాడుతున్న గోపాలకృష్ణ

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: ధ్యానంతో మానవునికి మరింత ఆరోగ్య వంతమైన జీవితం లభిస్తుందని పిరమిడ్ ధ్యాన గురువు దివంగత పత్రీజీ శిష్యుడు, ధ్యాన విశిష్టత, ఆవశ్యకతల ప్రచారకుడు డా.గోపాలకృష్ణ అన్నారు. నెల్లిమర్ల మండలం కొత్తపేట సమీపంలో ఉన్న బృందావన వ్యాలీలో పత్రీజీ శిష్యుడు వీరారెడ్డి, ఆయన కుమారుల ఆధ్వర్యంలో సుమారు రూ.2 కోట్లతో నిర్మించిన పిరమిడ్ ధ్యాన మందిరాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడుతూ ప్రపంచంలో ప్రతి వ్యక్తికీ ధ్యానం, జ్ఞానం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన ధ్యాన గురువులు గౌతమ్, రామారావు, సతీష్, జ్యోతి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల టిడ్కో గృహాలకు మహర్దశ

బీటీ రోడ్డు, కల్వర్టు నిర్మాణానికి నిధుల మంజూరు

నెల్లిమర్ల, న్యూస్‌టుడే


గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా ఆగిపోయిన నిర్మాణాలు

నెల్లిమర్ల నగర పంచాయతీలో త్వరలో టిడ్కో గృహ నిర్మాణాలకు సంబంధించిన పనులు ప్రారంభం కానున్నాయి. గత అయిదేళ్ల పాలనలో వైకాపా నిధులు మంజూరు చేయకపోవడంతో అసంపూర్తిగా నిలిచిపోయాయి. దీనితో లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రత్యేకంగా దృష్టి సారించడంతో పనులు ప్రారంభించేందుకు ముందుకు అడుగులు పడుతున్నాయి.

ఇదీ పరిస్థితి..

2014- 18 మధ్యలో 2,254 మంది లబ్ధిదారులను అప్పటి తెదేపా ప్రభుత్వం ఎంపిక చేసింది. తర్వాత క్షేత్రస్థాయిలో పరిశీలన అనంతరం 720 మందిని అర్హులుగా తేల్చారు. వైకాపా వచ్చాక 578 మందినే గుర్తించారు. అప్పటికే 820 మంది నుంచి రూ.3.42 కోట్ల నగదును సేకరించారు. దీనిలో 242 మంది ఇళ్లను రద్దు చేస్తూ గత ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు వారికి రూ.2.08 కోట్లను తిరిగి చెల్లించాల్సి ఉంది. నేటికీ ఇవ్వకపోవడం గమనార్హం.

మూడు నెలల్లో ప్రారంభం..

నగర పంచాయతీ పరిధిలోని నెల్లిమర్ల, జరజాపుపేట ప్రాంతాలకు చెందిన 576 మంది లబ్ధిదారుల పేరిట ఉన్న గృహ నిర్మాణాలు మరో మూడు నెలల్లో ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతం మౌలిక సదుపాయాల కల్పన ప్రక్రియ సాగుతోంది. కిటికీలు, మరుగుదొడ్లు, తాగునీరు పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నారు. తాగునీటి సరఫరాలో భాగంగా చంపావతి నది నుంచి ప్రధాన లైన్లను ఇక్కడి ట్యాంకుకు అనుసంధానిస్తున్నారు.

వాటిల్లో కదలిక..

గృహ సముదాయం నుంచి నెల్లిమర్ల పట్టణానికి వెళ్లే మార్గంలో బీటీ రహదారిని నిర్మించేందుకు సుమారు రూ.3 కోట్ల నిధులు మంజూరయ్యాయి. మధ్యలో శిథిలస్థితికి చేరిన కల్వర్టు స్థానంలో కొత్త నిర్మాణానికి రూ.80 లక్షలు విడుదల చేశారు. మరికొన్ని రోజుల్లో ఈ పనులు ప్రారంభిస్తామని టిడ్కో డీఈ శశిధర్ తెలిపారు. పెండింగ్ బిల్లులు కూడా త్వరలో విడుదలవుతాయని చెప్పారు.

ఇవేం ప్రమాద సూచికలు



విశాఖ నుంచి కొత్తవలస, ఎల్.కోట, ఎస్.కోట మీదుగా పర్యాటక కేంద్రాలైన అరకు, అనంతగిరి, బొర్రా, పాడేరు వెళ్లే జాతీయ రహదారి దుస్థితి ఇది. జమ్మాదేవిపేట పంచాయతీ పరిధిలో ఇలా ఎక్కడికక్కడే గుంతలమయంగా మారింది. ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోల చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో బోల్తా పడుతున్నట్లు చెప్పారు. దీంతో స్థానికులు గోతుల్లో ఇలా ప్లాస్టిక్ డబ్బాలు, నార సంచులు పెట్టారు. దీనిపై ఎన్‌హెచ్ ఇంజినీరింగు అధికారి సురేష్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. పరిశీలించి, చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, లక్కవరపుకోట

పడితే కానీ పట్టించుకోరా..?



పార్వతీపురం పట్టణ శివారులోని నవిరి కాలనీ నుంచి అడ్డాపుశీల వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. నవిరి కాలనీ మలుపులో, అడ్డాపుశీల కూడలి వద్ద పెద్ద గుంతలు కావడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు గుంతల్లో కూరుకుపోతున్నాయి. రహదారికి ఓ వైపు పెద్ద గుంత ఏర్పడటంతో ఒరిగిపోతున్నాయి. దీంతో చోదకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రహదారిని బాగు చేయాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, బెలగాం

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

పార్వతీపురం - 8008566244
పాలకొండ - 8008574299
సాలూరు - 8008786820
కురుపాం - 9849044696

? విదయోగుల కాలనీలోని ప్రాథమిక పాఠశాలకు వెళ్లే మార్గంలో చెత్త పేరుకుపోయింది. - అప్పలనాయుడు
• పరిశీలించి చెత్త తొలగిస్తాం. - తిరుపతిరావు, కార్యదర్శి - న్యూస్‌టుడే, సీతానగరం

? పాలకొండ రామకోవెలమందిర్ వీధి కాలువలో రహదారి గుంతలతో ప్రమాదకరంగా మారింది. - బి.సాయి, విద్యార్థి
• రహదారి మరమ్మతులు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. - దేవరప్రసాద్, ఏఈ - న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

? పాలకొండ- వీరఘట్టం రహదారిలో గణాలకాణా వంతెనపై మట్టి పేరుకుపోయి పిచ్చి మొక్కలు మొలిచాయి. - బాలమురళి
• నిర్మాణ నిధులకు ఉన్నతాధికారులకు నివేదిస్తాం. - కిరణ్‌కుమార్, ఏఈ, ఆర్‌అండ్‌బీ - న్యూస్‌టుడే, పాలకొండ

? మండల పరిషత్తు ఉపాధి హామీ కార్యాలయంలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతోంది. - చేతనదారులు
• వృథాగా ఉన్న జనరేటర్‌ను అందుబాటులోకి తీసుకొస్తాం. - బీవీజే పాత్రో, ఎంపీడీవో - న్యూస్‌టుడే, పాచిపెంట

? పార్వతీపురంలోని సంకవీధి సంస్కృత పాఠశాల సమీపంలో వ్యర్థాలు వేస్తున్నారు. దుర్వాసన వస్తోంది. - శ్రీను
• పరిసరాలు పరిశీలించి శుభ్రం చేయిస్తాం. - పకీరు, శానిటరీ అధికారి - న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

దరఖాస్తుల ఆహ్వానం

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సాలూరు ఐటీఐ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు తెలిపారు. ఐటీఐ.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో ఈనెల 26లోపు వివరాలు నమోదు చేసుకోవాలని, 28న కౌన్సెలింగ్‌కు రావాలన్నారు. ● సీతంపేట: సీతంపేట ఐటీఐలో ఉచిత స్వల్పకాలిక శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ గోపాలకృష్ణ, డీఎస్‌వో సాయికృష్ణచైతన్య తెలిపారు. వివరాలకు 79937 95796 నంబరును సంప్రదించాలని సూచించారు.

అనుమతులు రద్దుకు డిమాండు

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: బడిదేవర కొండపై గ్రానైట్ తవ్వకాల అనుమతులు రద్దు చేయాలని సీపీఎం, రైతు కూలీ, రైతు, గిరిజన సంక్షేమ సంఘాల ప్రతినిధులు డిమాండు చేశారు. బుధవారం తవ్వకాలను పరిశీలించారు. పిండిలోవ నుంచి సంగంవలస వరకు ఆనుకొని ఉన్న కొండ హద్దులు మార్చి అనుమతులు ఇవ్వడం శోచనీయమన్నారు. వెంగలవలస ప్రజలతో మాట్లాడి అభిప్రాయాలు సేకరించారు. ఆయా సంఘాల నాయకులు రంజిత్, కృష్ణమూర్తి, రాము, రామస్వామి ఉన్నారు.

ఓటరుగా నమోదు కావాలి

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాల్గొనేందుకు అర్హులు ఓటర్లుగా నమోదు కావాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బాలకృష్ణారావు కోరారు. బుధవారం పట్టణంలోని పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. 2021 తర్వాత పదవీ విరమణ చేసిన వారు కూడా అర్హులే అని వివరించారు. ఉమ్మడి జిల్లా గౌరవాధ్యక్షుడు బి.జోగినాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.ప్రభాకర్, ఏపీటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

నష్టాలు అంచనా వేయాలని ఆదేశం

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో ఏనుగుల సంచారంతో పంటలకు జరిగిన నష్టాలపై అంచనాలు తయారు చేయాలని అటవీ అధికారులను ఎమ్మెల్యే బి.విజయచంద్ర సూచించారు. బుధవారం అటవీశాఖ రేంజర్ బి.రాంనరేష్, ఎమ్మెల్యేను కలిసి పలు విషయాలపై చర్చించారు. ఇటీవల పెదబొండపల్లి, దిబ్బగుడ్డివలస, పుట్టూరులో పంటలు పాడైనట్లు చెప్పారు. సర్వే చేసి పరిహారం అందించాలన్నారు.

సదుపాయాలు కల్పించాలని నిరసన

సీతంపేట, న్యూస్‌టుడే: మండలంలోని ఎగువ, నడిమి, దిగువ ద్వారబంధం గ్రామాలకు తాగు నీరు అందించాలని గిరిజన సంఘం జిల్లా నాయకుడు ఎం.తిరుపతిరావు కోరారు. మూడు గ్రామాల్లో 80 కుటుంబాలు నివసిస్తున్నాయని, ఊటనీరు తాగుతున్నారని, వర్షాకాలంలో బురదతో ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. స్థానికంగా రక్షితపథకం ఏర్పాటు చేయాలని కోరారు.

సస్యరక్షణతో పంటలకు మేలు



పాచిపెంట: పొలంబడిలో అధికారులు, రైతులు

పాచిపెంట, సీతంపేట, కొమరాడ, జియ్యమ్మవలస, గరుగుబిల్లి, భామిని, న్యూస్‌టుడే: పంటలకు తగినంత మోతాదులో ఎరువులు, పురుగు మందులు వినియోగించాలని సాలూరు ఏడీఏ మధుసూదనరావు తెలిపారు. పాచిపెంట మండలంలోని కోస్టువలస, మంచాడవలసలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ● సీతంపేట మండలంలోని కుడ్డపల్లిలో ఏవో పి.శ్రీదేవి, కొమరాడ మండలంలోని పరుశురాంపురంలో జిల్లా రైతు శిక్షణ కేంద్రం అధికారి ఆర్.శ్రీనివాసరావు, ఏవో శంకరరావు, గరుగుబిల్లిలో శ్రీకాకుళం నైరా కళాశాల వ్యవసాయ విద్యార్థులు, జియ్యమ్మవలస మండలం బిత్రపాడు, గవరమ్మపేటలో ఏడీ నిర్మలాజ్యోతి, ఏవో జ్యోత్స్న, భామినిలో వాసన్ సంస్థ క్లస్టర్ కో-ఆర్డినేటర్ కె.మనోజ్‌కుమార్ రైతులకు అవగాహన కల్పించారు. అధికారుల సూచనలు, సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు సొంతమవుతాయన్నారు.

వ్యాసరచనలో ప్రతిభ





పార్వతీపురం పట్టణంలో లయన్స్ ఆంగ్ల మీడియం పాఠశాలలో బుధవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'అంతర్జాల వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అంశంపై 8, 9, 10 తరగతుల వారికి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ రాజాన వాసు పర్యవేక్షించారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రతిభ కనబర్చారు. పదో తరగతికి చెందిన ఎస్.ఎం.నిఖిత, పి.అక్షయ, ఆర్.పి.లక్ష్మి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ప్రిన్సిపల్ సతీష్ నారాయణన్ ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. - పార్వతీపురం కలెక్టరేట్ ప్రాంగణం

సభ్యత్వ నమోదులో ముందుండాం



అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే: తెలుగు దేశం పార్టీకి కార్యకర్తలే క్రియాశీలకమని ఎమ్మెల్యే బి.విజయచంద్ర పేర్కొన్నారు. బుధవారం లయన్స్ కల్యాణ మండపంలో నియోజకవర్గ సభ్యత్వ నమోదు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కార్యకర్తలు సభ్యత్వ నమోదులో సమష్టిగా కృషి చేయాలన్నారు. నియోజకవర్గంలో 50 వేల నమోదులు లక్ష్యంగా క్లస్టర్, బూత్ కమిటీలు పనిచేయాలన్నారు. పర్యవేక్షకుడు సత్తిబాబు, నాయకులు జి.వెంకటనాయుడు, బి.సీతారాం, పట్టణాధ్యక్షుడు జి.రవికుమార్, సీతానగరం, బలిజిపేట మండలాల నాయకులు పాల్గొన్నారు. ● పాలకొండ గ్రామీణం: తెదేపా సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలని మండలాధ్యక్షుడు రామినాయుడు పేర్కొన్నారు. షిర్డిసాయినగర్‌లో అవగాహన కల్పించారు.

మురుగు పారదు.. దీపాలు వెలగవు



కాలువ లేక నిలిచి మురుగు

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: సాలూరు పురపాలిక పరిధిలోని రామాకాలనీ ప్రజలు సమస్యలతో సతమతం అవుతున్నారు. రహదారులు, కాలువలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడికక్కడ మురుగు నిలిచిపోతోంది. వీధి దీపాలు ఏర్పాటుకు నోచుకోక రాత్రి వేళల్లో అంధకారం అలుముకుంటోంది. రవీంద్రభారతి పాఠశాల సమీపంలో నీరు నిలిచి చెరువును తలపిస్తోంది. పార్కు ముందు ఉన్న ఇళ్లకు మాత్రమే కుళాయిలు అందుబాటులో ఉన్నాయి. పార్కు వద్ద ఏర్పాటు చేసిన పైలెట్ నీటి పథకం ట్యాంకులు నిరుపయోగంగా మారాయి. వీటిలో ఒకటి పని చేయగా.. అక్కడే మురుగు పేరుకొని పరిసరాలు అధ్వానంగా మారాయి.

పార్కు నిరుపయోగం..

రామాకాలనీలో గత ప్రభుత్వ హయాంలో పార్కు నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరయ్యాయి. 2023లో టెండర్లు పిలిచారు. రూ.10 లక్షలతో పనులు చేశారు. కానీ బిల్లులు రాకపోవడంతో గుత్తేదారు వదిలేశారు. ప్రస్తుతం పార్కు మైదానంలా తయారైంది. ప్రహరీ లేక మందుబాబులు, ఆకతాయిలకు అడ్డాగా మారింది.

అధికారుల మాట..

రామాకాలనీలో పార్కు అభివృద్ధికి నిధులు వస్తే పనులు ముందుకు తీసుకెళ్తామని డీఈఈ ప్రసాదు తెలిపారు. ఇక్కడ కాలువలు, రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. కాలనీలో పరిసరాలు శుభ్రం చేసి, నీటి ట్యాంకులు అందుబాటులోకి తీసుకొస్తామని కమిషనర్ సత్యనారాయణ తెలియజేశారు.



ట్యాంకు ముందు అధ్వాన దుస్థితి

పట్టణానికి చేరువగా.. అభివృద్ధికి దూరంగా..



వైకెంపేట కాలనీలో మట్టిదారి

ప్రధాన మార్గం పక్కనే చెత్త..

వైకెంపేట కాలనీలో 430 ఇళ్లు, పక్కన మజ్జిగౌరి, బాలాజీ కాలనీల్లో 300 వరకు గృహాలున్నాయి. వీటి నుంచి సేకరిస్తున్న చెత్త వేసేందుకు సౌకర్యాలు లేకపోవడంతో రహదారి పక్కనే పడేస్తున్నారు. దీనిపై ఎంపీడీవో కె.రామేష్ వద్ద ప్రస్తావించగా.. ఇటీవల బాధ్యతలు స్వీకరించానని, వైకెంపేట, సమీప కాలనీల్లో పర్యటించి పరిష్కరిస్తామన్నారు.

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: పార్వతీపురం పట్టణానికి చేరువగా ఉన్న వైకెంపేట కాలనీ, ఆర్టీసీనగర్, ఆఫీసర్స్, మజ్జిగౌరి కాలనీ, శక్తి, బాలాజీ, వసుంధరానగర్ ప్రాంతాలు అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. వైకెంపేట కాలనీ ఏర్పాటై 25 ఏళ్లు దాటుతున్నా ప్రగతికి దూరంగా ఉంది. ఇక్కడ 1998లో 924 ఇళ్లు ఏర్పాటు చేశారు. తర్వాత కాలనీలో సగం ప్రాంతం 19 వార్డుగా మారింది. మిగిలిన సగం వెంకంపేట పంచాయతీలో 9, 10 వార్డులుగా మార్చారు. పురపాలిక, పంచాయతీ ఆధ్వర్యంలో ఉండటంతో కనీసం అనుసంధాన రహదారులకు నోచుకోవడం లేదు. గతంలో రహదారుల నిర్మాణానికి నిధులు వచ్చినా ఇక్కడ పనులు పూర్తి కావడం లేదు. కాలనీలోని హనుమాన్ మందిరం పక్కనున్న వీధిలో సిమెంట్ రోడ్డు 30 శాతమే మాత్రమే వేశారు. మిగిలిన 70 శాతం గోతులుగా మారింది. ఎస్పీ కార్యాలయం ఇక్కడే ఉన్నప్పటికీ వెనుకవైపు, చాకలి, కొత్త వీధుల్లో రహదారుల్లేవు.

దారి దారుణం.. ప్రయాణం నరకం



బలిజిపేట మండలంలోని గంగాడ- గళావల్లి వెళ్లే మార్గం అధ్వానంగా మారింది. మూడున్నర కిలోమీటర్ల పరిధిలో ఉన్న రహదారి పొడవునా కోతకు గురైంది. ఈ మార్గాన్ని వంగర, తెర్లాం, రాజాం, బలిజిపేట మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు వినియోగిస్తారు. దారి దారుణంగా ఉండటంతో వాహన చోదకులు అసౌకర్యానికి గురవుతున్నారు. దీనిపై రాజాం ర.భ.శాఖ జేఈ నాగభూషణం వద్ద ప్రస్తావించగా.. పనులకు నిధులు మంజూరయ్యాయని, త్వరలో టెండర్లు నిర్వహిస్తామన్నారు. - న్యూస్‌టుడే, బలిజిపేట

గుంతల మార్గంలో అవస్థలు

వీరఘట్టం మండలంలోని హుస్సేనుపురం నుంచి నీలంపేట, ఇల్లిసుపురం, నందిమానుగూడ, జరడకాలనీ వరకు ఉన్న రోడ్డు దారుణంగా మారింది. 2019లో అప్పటి వైకాపా ప్రభుత్వం 7 కిలోమీటర్ల మేర అభివృద్ధికి రూ.4.50 కోట్లు మంజూరు చేశారు. కానీ పనులు ఇప్పటికీ పూర్తి కాలేదు. 3 కాజ్‌వేలు, 15 కల్వర్టులు నిర్మించి, రహదారిపై కాంక్రీటు వేసి వదిలేశారు. వర్షాలతో రాళ్లు తేలడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనిపై ఏఈ కె.నాగభూషణరావు మాట్లాడుతూ.. పనులు వేగంగా జరిగేలా చూస్తామన్నారు. - న్యూస్‌టుడే, వీరఘట్టం



నీటికి తప్పని తిప్పలు



జియ్యమ్మవలస మండల పరిషత్తు కార్యాలయంలో నాలుగున్నరేళ్ల క్రితం సుమారు రూ.లక్షతో బోరు, మోటారు, ట్యాంకు ఏర్పాటు చేశారు. కొన్ని రోజుల క్రితం బోరు పాడైంది. అప్పటి నుంచి సిబ్బంది నీటి కోసం అవస్థలు పడుతున్నారు. చిన్న చిన్న అవసరాలకు బయట నుంచి తీసుకురావాల్సి వస్తోందని చెబుతున్నారు. బోరు, మోటారు బాగు చేయాలని కోరుతున్నారు. దీనిపై ఎంపీడీవో ఎస్.రమేష్ వద్ద ప్రస్తావించగా.. బోరుకు మరమ్మతులు చేస్తామని చెప్పారు. - న్యూస్‌టుడే, జియ్యమ్మవలస

ఆదమరిస్తే లోయలోకే!

పాలకొండ-వీరఘట్టం ప్రధాన రహదారిలో కల్వర్టు ప్రమాదకరంగా మారింది. ఇరువైపులా రక్షణ గోడలు విరగడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఆదమరిస్తే లోయలో పడే ప్రమాదం ఉందని చెబుతున్నారు. రాత్రి వేళల్లో శిథిలమైన గోడలు కనిపించని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. కల్వర్టులను తాత్కాలికంగా బాగు చేసేలా చూస్తామని ఎమ్మెల్యే జయకృష్ణ తెలిపారు. - న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం



చెడు వ్యసనాలకు బానిస కావొద్దు



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నీలకంఠం

కొమరాడ, న్యూస్‌టుడే: విద్యార్థులు మంచి ప్రవర్తనతో మెలగాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ నీలకంఠం అన్నారు. బుధవారం గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన కల్పించారు. గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తం



సిబ్బందికి వివరిస్తున్న అగ్నిమాపక శాఖాధికారి

పాలకొండ, న్యూస్‌టుడే: అగ్నిప్రమాదాలు సంభవించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని ఆ శాఖ అధికారి సర్వేశ్వరరావు అన్నారు. బుధవారం పాలకొండలో అవగాహన కల్పించారు. అగ్నిమాపక నిబంధనలు పాటించి, ప్రమాదాలకు దూరంగా ఉండాలని సూచించారు.

3 వేల మందికి ఉద్యోగావకాశాలు



ఎమ్మెల్యేతో సంస్థ ప్రతినిధులు

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు హైదరాబాద్‌కు చెందిన ధ్రువ్ కన్సల్టింగ్ సంస్థ ప్రతినిధి మన్మోహన్ తెలిపారు. ఎమ్మెల్యే జగదీశ్వరిని బుధవారం గుమ్మలక్ష్మీపురంలో కలిశారు. స్థానికంగా ఉద్యోగా మేళాలు నిర్వహించేందుకు 30 కంపెనీలు సిద్ధంగా ఉన్నాయని, 3 వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తాయని చెప్పారు. అర్హతకు అనుగుణంగా రూ.18 వేలు నుంచి రూ.45 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. త్వరలో తేదీలు ప్రకటిస్తామని, యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జగదీశ్వరి సూచించారు.

కప్పకల్లులో క్లోరినేషన్



గుమ్మలక్ష్మీపురం: కప్పకల్లులో గ్రావిటీ రక్షిత పథకం ద్వారా నీరు అందిస్తున్న ట్యాంకు శుభ్రం చేశారు. స్థానికులు ఇక్కడ సమస్యను ఈనాడు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు వివరించారు. ఈ నెల 21న వార్త ప్రచురించగా కార్యదర్శి మల్లేశ్వరరావు స్పందించి క్లోరినేషన్ చేయించారు.

స్పందనకు వందనం

పైపులైను మరమ్మతులు

సీతానగరం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో ఎస్‌బీఐ ఎదురుగా గూడెం వీధి కూడలి వద్ద తాగునీటి పథకం పైపులైనును బుధవారం బాగు చేశారు. ఇక్కడ లీకులతో రహదారి బురదగా మారుతోందని ఈ నెల 15న స్థానికులు ఈనాడు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలియజేశారు. వార్త ప్రచురించగా. . ఈవో రమేష్ స్పందించారు. సర్పంచి తేరేజమ్మ ఆధ్వర్యంలో పనులు చేశారు.

అద్దెకు గోదాము

పాచిపెంట, న్యూస్‌టుడే: పాచిపెంటలో నిర్మించిన 2 వేల టన్నుల గోదామును రైతులు కోరితే అద్దెకు ఇస్తామని జిల్లా అగ్రిట్రేడ్, మార్కెటింగ్ అధికారి ఐ.గంగాధరరావు తెలిపారు. 'గోదాములు నిరుపయోగం' శీర్షికతో బుధవారం ఈనాడులో వెలువడిన చిత్రవార్తపై ఆయన స్పందించారు. 360 టన్నుల సామర్థ్యమున్న గోదాం పరిసరాలు శుభ్రం చేశామన్నారు.

కమిషనరుగా శ్రీనివాసరాజు

పార్వతీపురం పురపాలక: పురపాలక సంఘానికి డీఈగా బదిలీపై వచ్చిన జి శ్రీనివాసరాజు కమిషనరుగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీఈ పి.కిరణ్‌కుమార్ బదిలీపై బొబ్బిలి వెళ్లగా శ్రీనివాసరాజును నియమించారు. ప్రస్తుతం ఆయనకు కమిషనర్‌గా అవకాశం ఇచ్చారు.

ఆలయ వార్షికోత్సవం

పార్వతీపురం గ్రామీణం: నర్సిపురంలో అయ్యప్ప స్వామి మందిరం తొమ్మిదో వార్షికోత్సవం సందర్భంగా పూజలు చేశారు. గురుస్వామి రామస్వామి ఆధ్వర్యంలో పూజలు, భజనలు చేపట్టారు.

ప్రభాస్ జన్మదిన వేడుకలు

గుమ్మలక్ష్మీపురం: సినీ హీరో ప్రభాస్ జన్మదిన వేడుకలు గుమ్మలక్ష్మీపురంలో నిర్వహించారు. కేకు కోసి, మిఠాయిలు పంచారు. భద్రగిరి సీహెచ్‌సీలో రోగులు, గర్భిణులకు పండ్లు, రొట్టెలను అభిమానులు అందజేశారు. సంతోష్ పండా, అశోక్, హర్ష తదితరులు ఉన్నారు.

ఆట పాటలతో బోధన

గుమ్మలక్ష్మీపురం: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పోషకాహారంతో పాటు ఆట పాటలతో వినూత్న బోధన చేపడితే సత్ఫలితాలు వస్తాయని భద్రగిరి ఐసీడీఎస్ సీడీపీవో సుశీలాదేవి అన్నారు. నృత్యాలతో బోధించే విధానంపై కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. పర్యవేక్షకులు ఈశ్వరమ్మ, శ్రీదేవి, ఉన్నీష ఉన్నారు.

సప్తాహ యాగ పూజలు

సీతానగరం: స్థానిక వేణుగోపాల ఆలయ ప్రాంగణంలో మత్తిరుమల రంగనాథం అయ్యవార్ల ఆధ్వర్యంలో భాగవత సప్తాహ జ్ఞానయజ్ఞం చేపట్టారు. బుధవారం ప్రధాన మండప ఆవహనం, అగ్నిప్రతిష్ఠ, భాగవత పారాయణం చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

సాలూరు గ్రామీణం: బొడ్డవలస గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కమల్- డిస్కస్‌త్రో, షాట్‌పుట్, నిరంజన్- హ్యాండ్‌బాల్, నూతన్, హేమంత- వాలీబాల్ పోటీల్లో జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చారు.

నాటుసారా, ఊట ధ్వంసం

జియ్యమ్మవలస: చినమేరంగి సమీపంలో నాటు సారా స్థావరంపై ఎస్‌ఐ పి.అనీష్, సిబ్బంది దాడులు చేశారు. 400 లీటర్ల ఊట ధ్వంసం చేసి, 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు.

సీపీఎస్ రద్దే లక్ష్యం

భామిని: సీపీఎస్ రద్దే లక్ష్యంగా పీఆర్‌టీయూ పని చేస్తుందని సీనియర్ నాయకుడు వి.హరిచంద్రుడు అన్నారు. భామినిలోని అంబేడ్కర్ గురుకులం, కేజీబీవీ, ఉన్నత, ఆదర్శ పాఠశాలను సందర్శించారు. శాసన మండలి ఎన్నికల్లో గాదె శ్రీనివాసులు నాయుడును గెలిపిస్తే సీపీఎస్ రద్దు చేసేందుకు పనిచేస్తారన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



పోటీలు ప్రారంభిస్తున్న డీఈవో పగడాలమ్మ

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులు ఆటల్లో రాణించి ఉమ్మడి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని డీఈవో పగడాలమ్మ సూచించారు. మండలంలోని ఎమ్మార్‌నగరం జడ్పీ పాఠశాల ఆధ్వర్యంలో వెంకంపేటలో ఉభయ జిల్లాల అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభించారు. 55 పాఠశాలల నుంచి 223 మంది క్రీడాకారులు తరలివచ్చి వివిధ రకాల క్రీడల్లో పాల్గొన్నారు. ఇక్కడ 10 రకాల క్రీడలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి మురళి తెలిపారు. కన్వీనర్ వాసుదేవరావు, కార్యదర్శులు చంద్రమోహన్, సమన్వయకర్త వైకుంఠరావు, నాగేంద్రబాబు, చక్రవర్తి, వెంకటనాయుడు, గాంధీ పాల్గొన్నారు.

నిందలు వేసుకోవడం సరికాదు



సమస్యలు వివరిస్తున్న గుజ్జువాయి సర్పంచి

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: సమస్యల పరిష్కారానికి సమావేశాలు నిర్వహిస్తున్నామని, నిందలు వేసుకోవడం సరికాదని ఎంపీపీ పద్మావతి మండిపడ్డారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఏం జరుగుతున్నా అధికారులు సర్పంచి దృష్టికి తీసుకురావడం లేదన్నారు. మూడు నెలల్లో చేసిన ప్రగతి నివేదికపై సమీక్షించారు. ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి, జడ్పీటీసీ సుజాత, ఈవోపీఆర్డీ రమేష్‌బాబు అధికారులు పాల్గొన్నారు.

'పుస్తకాలు ఇస్తే కదా.. లోపాలు గుర్తించేది'

పాచిపెంట, న్యూస్‌టుడే: రీ-సర్వే జరిగిన తర్వాత పట్టాదారు పాస్ పుస్తకాలు రైతులకు ఇస్తే కదా లోపాలు తెలిసే వీలుంటుందని రెవెన్యూ అధికారులను పలువురు ప్రశ్నించారు. సర్వే తర్వాత పుస్తకాలు ఇవ్వలేదన్నారు. బుధవారం పాంచాలి, గురివినాయుడుపేట గ్రామాల్లో సర్వే సమస్యలపై పరిష్కార సభలు నిర్వహించారు. గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన పుస్తకాల్లో సమస్యలు రావడంతో తిరిగి పంపించామని, మీ-భూమి వెబ్‌సైట్‌లో వివరాలు తెలుసుకోవాలని రైతులకు అధికారులు సూచించారు. పాంచాలిలో 28, గురివినాయుడు పేటలో 5 ఫిర్యాదులు అందాయని చెప్పారు.

ఎన్‌సీసీ ధ్రువపత్రాల అందజేత



ధ్రువపత్రాలు చూపుతున్న విద్యార్థులు

భామిని, న్యూస్‌టుడే: భామిని ఆదర్శ పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థులకు బుధవారం ప్రిన్సిపల్ ఆర్.శివకుమార్ ధ్రువపత్రాలు అందజేశారు. పాఠశాల జూనియర్ డివిజన్ ఆర్మీ మొదటి బ్యాచ్‌కు చెందిన 52 మంది టెక్కలిలోని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 5 నుంచి 14 వరకు కంబైన్డ్ మాన్యువల్ ట్రైనింగ్ క్యాంప్‌లో పాల్గొని విజయవంతంగా శిక్షణ పూర్తి చేశారు. వైస్ ప్రిన్సిపల్ బాబూరావు, 14 ఆంధ్ర బెటాలియన్ శ్రీకాకుళం ఆర్మీ అధికారి శ్రీనివాసరావు, విద్యార్థుల కేర్ టేకర్ జి.శివరాం ప్రసాదు ఉన్నారు.

పండగ వాతావరణంలో సమావేశాలు



హాజరైన ప్రధానోపాధ్యాయులు

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా నవంబరు 14న పాఠశాలల్లో జరగనున్న తల్లిదండ్రుల సమావేశాన్ని ప్రతి ఒక్కరూ సక్రమంగా నిర్వహించాలని విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు, సమగ్ర శిక్ష పీడీ బి.శ్రీనివాసరావు సూచించారు. బుధవారం సాలూరులో అన్ని పాఠశాలల హెచ్‌ఎంలతో దూరదృశ్య సమావేశం జరిగింది. 'బడి వైపు ఒక అడుగు' కార్యక్రమాన్ని పండగ వాతావరణంలో నిర్వహించాలన్నారు. 9, 10 తరగతుల విద్యార్థులకు కేటాయించనున్న అపార్ సంఖ్యలో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించామన్నారు.